# ప్రేమించని పెళ్లికొడుకు

**కీర్తిప్రియ**

విసనకర్రలు రెపరెప లాడుతున్నాయి. రకరకాల నవ్వులూ, ఆత్మస్తుతీ, పరనిందా జీవిత పరమావధిగాగల వాళ్ల పలుకులూ యెదుట వాళ్లు నమ్ముతారా లేదా అన్న ఆలోచనకూడా లేకుండా కొందరు పెద్దమనుష్యులు తెలిపే ప్రపంచపు వింతలూ విడిది యింటి గదుల్లో వినిపిస్తున్నాయి. భుక్తాయాసాలు తీర్చుకోవడానికి వీపులు గోడకు చేరవేసి కొందరూ, జంబుఖానాల మీద శరీరాలు వెల్లకిలవేసీ, బోర్లవేసీ కొందరూవున్నారు. అంతటి సందడిలోనూ మహాకాయుల ఉచ్ఛ్వాస నిశ్వాసాలూ, మహానుభావుల గురకలు వినబడుతూనే ఉన్నాయి.

మేడమీద మధ్య హాలులో గది నిండా పరచిన జంబుఖానామీద ఒకపక్క చంద్రశేఖరం కూర్చున్నారు. ఆయన సమీపంలో పెద్దలూ, పిన్నలూ కూర్చున్నారు. చంద్రశేఖరం 'కబుర్లపోగు'! ఆయనచెప్పే కబుర్లు వినడానికి పిన్నాపెద్దా చుట్టూచేరుతారు. ఆయన వస్తున్నారంటే రాలేనివాళ్లు కూడా పెళ్ళిళ్ళకి వస్తారు. పెళ్లిచేస్తే నలుగురూ వచ్చి భోజనాలుచేసి తీరాలని అనే పూర్వకాలపు మనుష్యులు ఏమాత్రం సంబంధం వున్నా చంద్రశేఖరాన్ని పెళ్లికి రమ్మని బలవంత పెడతారు. అతనువస్తే ఇంకో నలుగురువస్తారని అలా బలవంతం పెట్టడం వల్లే చంద్రశేఖరం యీ పెళ్లికి వచ్చేరు. యథార్థానికి ఆయన పెళ్లికొడుక్కి చాలా దూరపు బంధువు.

చంద్రశేఖరం యెదుట తమలపాకులూ, సున్నం, వక్కపొడివున్న పళ్ళెం వుంది. అక్కడున్న వాళ్ళు ఆకులకి సున్నాలు రాసి వక్కపొడి చేర్చి వేసుకుంటున్నారు. సాహసించి తమలపాకులు తీయలేని కొందరు కళ్లు అప్పజెప్పి చూస్తున్నారు. చంద్రశేఖరం చెప్పే కథలూ, కబుర్లు వినడానికి వాళ్లందరూ అక్కడ చేరేరు.

ఇంతలో పెళ్లికొడుకు పినతండ్రీ, ఆయన బావమరిది అక్కడికి వచ్చేరు. 'దయచేయండి, దయచేయండి' అని మన్ననచేసి స్థలం చూపించేరు అక్కడున్నవారు. కూర్చుంటూ 'హమ్మయ్య' అన్నారు. పెళ్ళికొడుకు పినతండ్రి, "'క్రేవ్' మని లేవక హమ్మయ్యా అంటారేం అండీ బావగారూ" అన్నారు చంద్రశేఖరం, "అనొద్దటండీ పెళ్ళయినవరకూ అవుతుందా లేదా అనుకున్నాంగదా" అన్నారు పెళ్ళికొడుకు పినతండ్రి ప్రక్కనున్న ఆయన బావమరిది. హాలాహలం మింగలేక, పైకి క్రక్కలేక కంఠంలో దాచిన గరళకంఠుడిలా అప్పటివరకు ఆయన దాచిపెట్టేడా రహస్యాన్ని. దాన్ని కాస్తా యిప్పుడు బయటికి చెప్పేసేడు.

"ఏమిటి విశేషం" అన్నాయి రెండు మూడు కంఠాలు.

"మరేంలేదు. అసలు పెళ్ళికొడుకు చాలా వినయవిధేయతలు కలవాడే, పెళ్ళికూతుర్ని చూస్తేనేగాని పెళ్ళిళ్లు చేసుకోని యీ రోజుల్లో "పెద్దల యిష్టమే కానియ్యండి" అన్నాడు. వివాహ ప్రయత్నాలు అన్నీ అవనిచ్చి మూడురోజుల క్రిందట నే నాపెళ్ళి చేసుకోనని చిందులు త్రొక్కడం మొదలుపెట్టేడు. 'ఏమిటి విశేషం' అని అడిగేం. "పెళ్లికూతురు పెద్ద వయసుదానిలా వుందని ఆడవాళ్లు అందరూ పరిహాసం అంటున్నారట. పెళ్లికూతురు గ్రామంవాడే అయిన క్లాస్‌మేట్ ఒకడు 'షేక్‌స్పియరులాగ పెద్దవయసు పెళ్లాన్ని పెళ్ళాడుతున్నావేంరోయ్' అన్నాడట.

"దానితో వాడికి వెఱ్ఱెత్తి నానాహంగామా చేసేడు. కొందరిమొహాలు ముదరమొహాలుంటాయనివాణ్ని సమాధానపరచి, ఆపిల్ల జాతకం తెప్పించి చూపించి, ఉభయత్రా బాంధవ్యమున్న వాళ్ళచేత పుష్కరాల లెక్కనీ, 'తాంబూల రోజుల' లెక్కనీ పెళ్ళికూతురు వయసు సప్రమాణికంగా ఋజువు చేయించి ఒప్పించేటప్పటికి తలప్రాణం తోకకి వచ్చింది. అప్పటికీ తీరా అశుభ ఘడియలు కాస్తా దగ్గరపడ్డాక ఏం ప్రెత్తుతుందో అని ఎంతో జాగ్రత్తపడ్డాం. ఆ మూడుముళ్లు పడ్డాయికదా మరి భర్వాలేదని రహస్యంగా వున్న విషయంకాస్తా పైకి చెప్పేసేను." అన్నాడా చుట్టం చుట్టుప్రక్కల కలయజూస్తూ.

"ఓస్! అంతే కదటండీ! ఇకభర్వాలేదు. సంవత్సరం తిరిగేటప్పటికి ఓ పిల్లాణ్ని భుజాన్నేసుకొని ఆవిడగారు 'చీచ్చో బిల్లీ' అంటూంటే మనవాడు కాలుకాలిన పిల్లిలా తిరుగుతుంటాడు" అన్నారు చంద్రశేఖరం. అందరూ విరగబడి నవ్వేరు.

"ఎందుచేతనంటే పెళ్లికూతురుకు రూపనో, చదువురానిదనో పెళ్ళిచేసుకోనని గొడవపెట్టే పెళ్లికొడుకులూ, పెళ్లికొడుకు పల్లెటూరి మొద్దనో, పట్నవాసం వాడయినా శుభ్రంగా షోకుచేసుకు వీధుల్లో తిరగడనో కంటతడి పెట్టే పెళ్ళికూతుళ్ని తరచూ చూస్తూనే వుంటాం. వాళ్లు అన్ని అలకలు అలిగి ఆఖర్ని నిక్షేపంలాగ కాపురాలు చేసుకుంటారు. ఓ సారి ఓ గమ్మత్తయిన సంఘటన జరిగింది"

'ఏమిటండీ అది' అని ఎవరూ అడగకుండానే చంద్రశేఖరం చెప్పడం ప్రారంభించేరు.

"పెళ్లికొడుకు తండ్రి తాతా, మా తాతగారు పెత్తండ్రి పినతండ్రి బిడ్డలు. అంటే యిపుడు నేనూ జగన్నాథమూ అయినట్టు" అని అక్కడ కూర్చున్నవారిలో ఒకరివైపు చూసేరు చంద్రశేఖరం.

"ఎవరూ ఆ సుబ్బయ్యగారి విశ్వనాథం పెళ్ళిగురించిటండీ, చెప్పండి, చెప్పండి అప్పుడేదో గొడవైందనుకున్నారు. నేను ఉత్తరాది యాత్రబండి వస్తే అందులో వెళ్లాను. పెళ్ళికి రాలేదు" అన్నాడు జగన్నాథం.

మరే, మరే, ఏమీలేదు. నలుగురూచేరి ఒక సలక్షణమైన సంబంధం చూసేంకదా. పిల్లా బుద్ధిమంతురాలు, పనిమంతురాలు. పిల్లతండ్రా స్థితిపరుడు, మంచిసంప్రదాయం వున్నవాడూనూ. శ్రేష్ఠమైన సంబంధం అనుకున్నాం అందరం. పెళ్ళికి మగపెళ్ళివారమంతా వెళ్ళి పెళ్ళయ్యాక తిరిగి వచ్చేం."

"పెళ్లయి తిరిగివస్తే మరి జరిగిన గొడ

# ★ ప్రేమించని పెళ్ళికొడుకు ★

ఏమిటి" అన్నాడు శ్రోతల్లో ఒకడు.

"అక్కడే వుందండీ కథంతా. శోభనం నాడు రాత్రి గదిలో ప్రవేశపెట్టడానికి అన్నీ సన్నాహాలుచేసి పెళ్ళికొడుకుని వెదక వలసివచ్చింది. ఎక్కడచూసినా కనపడడు. పెద్దలలో చలనం బయలుదేరింది.

"ఎక్కడకు పోయివుంటాడా అని నేనూ ఆలోచిస్తున్నాను. ఆ మాడుముళ్లు వేసిం దగ్గరనుంచీ అదోలా వున్నాడు మనిషి. తిరిగి వస్తుంటే రైలుపెట్టెలో కుర్రకారంతా వాణ్ని హేళన చెయ్యడం మొదలుపెట్టేరు. 'నీ పెళ్లాం హిడింబిరా' అని ఒకడూ, 'భాబూ! గుమ్మాలు మార్పించావా లేదురా' అని ఒకడూ, 'ఫరవాలేదు అడ్డుగా తిరిగి అడుగు పెడుతుందిరా' అని ఒకడూ రకరకాలుగా అనడం మొదలుపెట్టేరు. ఆ పెట్టెలోనే నేనూ వున్నప్పటికీ, మీద పెట్టెలు పెట్టేచోట బలవంతాన్ని కళ్లుమూసుకుని వుండడాన్ని నిద్రపోతున్నానుఅనుకున్నారు వాళ్లు. నేను ఆగోలవినలేక కూర్చుని దిగువకు వంగి చూసేటప్పటికి, విస్సిగాడి మొహం వాడుక చెయ్యని యింటికివుండే తుప్పపట్టిన తాళంకప్పలా వుంది. నేను దిగువకుదిగగానే అందరూ 'గుప్ చుప్' మని వూరుకున్నారు.

"జరిగిన విషయాలు మననం చేసుకొని విస్సిగాడు కనపడకపోవటానికి కారణం వూహించుకుంటుంటే వాళ్ళ నాన్న వచ్చేడు. అతను 'అన్నయ్యా! నాకేం పాలు పోవడం లేదు. అంతా గ్రామంలో వెదకడానికి వెళ్ళేరు. ఇంతవరకూ చక్కగా జరుగుతూ వచ్చిన శుభకార్యం కాస్తా ఏమౌతుందో అని వుంది. నా గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయంటే నమ్ము' అన్నాడు.

"నాకు ఒక్కసారి మెరుపులా ఆలోచన తట్టింది. 'నీకేం భయంలేదు సుబ్బన్నా! వాడేవస్తాడు. కుర్రవాడు కదూ యీ రోజుల కాస్త ముందుగానే యింట్లో వుంటే కుర్రకారంతా హేళన చేస్తారని ఎటో వెళ్ళివుంటాడు. నేను తీసుకువస్తాను. నువ్వు నీ పనులు చూసుకో' అన్నాను.

"వెంటనే మామిడి తోటల మధ్య కాలి బాటల గుండా గ్రామానికి ఉత్తర దిశగా వెళ్ళాను."

"గ్రామానికి ఉత్తర దిశను ఏంటుందేమిటండీ" అన్నాడొక శ్రోత.

"ఏంలేదండీ. రెండుఫర్లాంగులదూరంలో తూర్పు పడమలకు పోతూ రైలు రోడ్డు వుంది. ఆ గ్రామానికి అటు రెండు మైళ్ళలోనూ, యిటు రెండు మైళ్ళలోనూ చిన్న స్టేషన్లున్నాయి. నేను రైలు గట్టుచేరి అటూ యిటూ చూసేను. అంతా వెన్నెల వెలుగులు, చెట్ల నీడల చీకట్లు, కీచురాళ్ల శబ్దాలు తప్ప ప్రకృతి నిశ్శబ్దంగా వుంది. అటు యిటూ కనుచూపుమేర ఎవరి జాడా లేదు. వెన్నెలలో రైలు బద్దీలు అనంతంలో కలిసిపోతున్న రెండు సన్నని వెలుగు బాటల్లాగ వున్నాయి.

నా యెడమ చేతి వైపు రెండు ఫర్లాంగుల దూరంలో రైలు రోడ్డు ప్రక్కనే ఓపాడు పడిన వంటగది యిల్లు వుంది. అది దెయ్యాల నివాసస్థలమని ప్రసిద్ధి. అటు పక్క వెళ్ళడమా కుడిచేతి పక్క వెళ్ళడమా అని ఆలోచించ వలసి వచ్చింది. ఏం చేలో చావ సిద్ధపై వచ్చినవాడుకూడా ఆ దెయ్యాలకొంప వైపు వెళ్ళడనిపించింది. యథార్థం చెప్పొద్దూ, ఎంత పుచ్చపువ్వులా వెన్నెలవున్నా అటువెళ్లడానికి నాకే భయం వేసింది. అటు ఓ పదిగజాల మేర వెళ్ళి ముందుకుడిచేతివైపువెళ్లి అవసరమయితే అటువైపు వెళ్ళవచ్చునుకుని మళ్ళీ వెనక్కి తిరిగేను."

"అటుపక్క కనపడ్డాడా?"

"కనపడక ఏమౌతాడు. అలా ఓ మైలు దూరము వెళ్ళేటప్పటికి కొద్దిగజాల దూరములో 'లెవెల్ పలకని' చేరబడి 'విస్సి' కన్పించేడు. దూరానికి రూపం కన్పించక పోయినా వాడేఅయివుండాలనిపించింది. కాళ్ళు రెండూ దగ్గరచేర్చి మోకాళ్ళమీద నుదురుఆన్చి అంతర్ముఖుడయియున్నాడు. కునుకుపాట్లు పడుతున్నాడేమో.

దగ్గరగావెళ్ళి 'విశ్వనాథం', 'విశ్వనాథం' అని పిలిచేను. 'ఎవరూ...' అని కేక వేస్తూ లేచి నిలబడ్డాడు. 'నేనూ శేఖరం పెదనాన్నని' అన్నాను.

'ఏం పెదనాన్నా!' అన్నాడు ఏమీ తెలియనివాడిలా.

'ఏం పెదనాన్నా! అని యింకా యిక్కడ కూర్చుంటే ఎలా. పద' అని వాణ్ని రెక్కపట్టుకులేపి నడిపిస్తుంటే నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ తూర్పుదిశనుండి రైలు యింజను శబ్దంచేసింది. స్టేషనువిడిచిపెట్టిందన్నమాట. తనుపులేకపోవడాన్ని ఒక్కసారి త్రుళ్ళిపడ్డాం. పట్టాలకడ్డుగా పరుగెత్తి అవతల పక్కకి చేరం.

'నేను రాను పెదనాన్నా' అన్నాడు. అన్నాడేగాని అప్పటికప్పుడే వాడికి మళ్ళీ ప్రాణంమీద తీపికలిగింది. అంచేతే చెయ్యి విదుల్చుకుని పరుగెత్తకుండా నిలబడ్డాడు.

'అయితే నేను చెప్పేవి నాలుగుముక్కలు విని, నీకు తోచినట్టు చెయ్యి' అన్నాను. విశ్వం ఏం మాట్లాడలేదు.

'చూడు. ఎవరో కుర్రవెధవలు నీ పెళ్లాం లావుగావుందని అన్న మాత్రాన మాడుముళ్లు వేసేక దాన్ని కాదంటావా. అదీకాక పెళ్ళి కూతురు లావుగావుందనే అనుకున్నావు. గాని నువ్వు సన్నంగా చీపురుపుల్లలా వున్నావన్న సంగతి గుర్తుతెచ్చుకున్నావా? ఆ పిల్లని వాళ్ల స్నేహితులు ఆక్షేపించరూ? అందులో ఆడవాళ్ల ఆక్షేపణ చెప్పతరమా? అంతమాత్రాన యిప్పుడు ఆ పిల్ల ఉరిపోసుకుంటానందా? నుదుట ఎలా వ్రాస్తే అలానే అవుతుందని నువ్వు మంగళసూత్రం గట్టిగా బిగిస్తుంటే మాటాడక వూరుకుంది. లావు




## పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, నీ సరియైన చర్యనుగురించిన్నీ నీవు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన నీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, నీవు కార్డు వ్రాసిన తేదిల గాయతు 12 మాసములలోను నీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంప బడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.



రాధ - మాధవుడు

ఫొటో: పట్నాల సుబ్బారావు—చల్లపల్లి.

కాక, పన్నం కాక, బొట్టి కాక, పొడవు కాక, అన్ని విధాలా అందంగా వుండి, చెప్పినమాట వినేవాళ్లూ, చదువున్న వాళ్లూ పెళ్లాలు కావాలని మగవాళ్లూ, పెద్ద ఉద్యోగం చేస్తూ, నౌకర్లూ చాకర్లూ వుండి ఎర్రగా బుర్రగా వుండి, లక్షలు ఆర్జించే భర్తలు కావాలని ఆడవాళ్ళు అంతా కోర్కెలు కోరితే ప్రపంచంలో నూటికి తొంభై మందికి పెళ్లవుతాయా? శారీరకంగానూ, మానసికంగానూ విభిన్న ప్రకృతులు గల వాళ్లు జంటగా జీవితం గడపడమే వివాహంలో గొప్ప విశేషం."

"ఇలా ఏవేవో మాట్లాడుతూ యింటి వైపు నడక సాగించేను. పెద్దవాణ్ని వడం చేతో, ఆమాటలు వచ్చుడంచేతో విశ్వం జ్ఞాపకం వస్తూ వచ్చేయడం మొదలు పెట్టేడు. రైలు నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ నిప్పులు కక్కుకుంటూ వెళ్ళిపోయింది.

నేను సంభాషణ సాగిస్తూ 'నీలాగే మా పినతల్లిగా రవమ్మాయి చాలాకాలం క్రిందట పెళ్లిలో గొడవ పెట్టింది. ఆ కథ చెబుతా విను అన్నాను."

"భేష్! భేష్ కథలో కథ. బాగుంది, చెప్పండి" అన్నా డాకాయన.

"కథలో కథ చెప్పడానికి నేనేం కథా సరిత్సాగరం తప్ప చెపుతున్నా ననుకున్నా రటండీ. యథార్థంగా ఆ వేళ జరిగిన విషయమే చెపుతున్నాను."

"చిన్నవాడు వాడికేం పోనిద్దురూ, మర్యాదా మప్పితం తెలీదు. మీరు కానివ్వండి" అన్నా రొక మీసాల ఆసామి.

"ఆ! కధకేం వుందిలెండి. మా పినతల్లి గారమ్మాయి లేదూ...మీలో చాలామందికి తెలియకపోవచ్చులెండి. నర్సీపట్నం దగ్గర ఓ చిన్న పల్లెటూరు యిచ్చేరు. వాళ్ళది కూడా ఆ దగ్గర గ్రామమే. ఆ పెళ్ళికి నేను వెళ్ళేను. అన్ని పెళ్లిళ్లకి తయారయ్యే భోజన ప్రియుణ్ని స్వయానా పినతల్లి కూతురు పెళ్ళికి వెళ్ళనా.

"అప్పుడింక పెళ్ళిపీటలమీద కూర్చోవలసిన సమయానికి పెళ్ళికూతురు నేను వెళ్లనని ఏడుపు లంకించుకుంది. అంతకు ముందే పెళ్ళికూతురు చిన్నన్న ఆ సంబంధానికి ఆగ్రహించి పెళ్ళికి యింటిదగ్గర వుండడం మానేసేడు. మా పినతల్లి ఓ మూల కూర్చుని కళ్లు ఒత్తుకుంటుంది.

"వాళ్ళకి ఆ పిల్ల ఒక్కర్తే ఆడపిల్ల. ఎంతో ముద్దుగా పెంచేరు. చిన్నపిల్లప్పటి నుండి నర్సీపట్నంనుండి ఓ మేష్టరువచ్చి సంగీతం నేర్పేవాడు. అల్లికా, కుట్టూ గ్రామంలో నే నేర్చుకుంది. వాళ్ళ చిన్నన్న ఇంగ్లీషు పాఠాలుకూడా నేర్పేడు. పిల్ల కూడా అందంగా వుంటుంది. అన్ని విధాలా అదృష్టవంతురాలైన ఆ అమ్మాయికి దక్కని

(47-వ పేజీ చూడండి)

# ★ ప్రేమించని పెళ్లికొడుకు ★

(21-వ పేజీ తరువాయి)

సంబంధం చూడడానికి విశ్వ ప్రయత్నం చేసేరు వాళ్ళనాన్న. కాని డబ్బు దగ్గర అవన్నీ వృధా అయ్యేయి. అబ్బాయిలుగల పెద్దల హిరణ్యాక్షవరాలు నెరవేర్చలేక ఆ ప్రక్క గ్రామంలో నేవున్న ఓ అబ్బాయి కివ్వడానికి నిశ్చయించేరు. అబ్బాయి కొద్దిగా నల్లగా వుంటాడన్న మాటేగాని గుణవంతుడు. చదువులేదన్న మాటేగాని బుద్ధిమంతుడు. వాళ్లు యిద్దరే అన్నదమ్ములు. తాతలనాటి నుండి వసున్న ఆస్తిని పాడు చెయ్యకుండా, ఒకర్ని దేహీ అనకుండా సుఖంగా కాలక్షేపం చేస్తున్నారు.

"వాళ్లు స్థితిపరులూ, కట్నాలు పెద్దగా కోరనివాళ్ళూ, కోరి ఆ పిల్లను చేసుకుంటామని వచ్చినవాళ్ళూ అయినా నల్లగా వుంటాడనీ, చదువులేదనీ పెళ్ళికూతురికీ, మా పిన తల్లికీ, ఆవిడ చిన్నబ్బాయికీ నచ్చలేదు ఆ సంబంధం. ఆఖరికి ఎలాగయితే నేం నలుగురు పెద్దవాళ్లు నప్పించి ఆ మూడుముళ్లు పడేటట్టు చేసేరు. ఇప్పుడు ఒంటినిండా బంగారం, యింటినిండా పిల్లలతో కలకల్లాడుతూంది. ఎప్పుడైనా నవ్వడానికి 'ఏమమ్మా చెల్లీ! నల్లబావ బాగున్నాడా' అంటే 'శేఖరం అన్నయ్య యింకా మర్చిపోలేదు' అని నవ్వుకుంటుంది" అని కథ పూర్తిచేసేను.

"విశ్వం మరి మారుపలకకుండా నా వెనకనే యింటికి వచ్చేసేడు" అని అసలు కథ కూడా పూర్తిచేసేడు చంద్రశేఖరం.

"అంతేనండీ మనలో పెళ్లిళ్లే అంత. ఇంకా యిప్పుడిప్పుడుగాని పాశ్చాత్యుల్లాగ ప్రేమించి పెళ్లిచేసుకోవడాలు మనలో లేవు" అన్నారొకాయన.

"అందుకే కదటండీ రాధాకృష్ణ పండితుడు 'మనం ప్రేమించిన ఆడదాన్ని పెళ్లాడం, పెళ్ళాడిన ఆడదాన్ని ప్రేమిస్తాం' అన్నాడు" అని అందుకున్నారు మరొకరు.

"అప్పుడే కథ అయిపోలేదు. ఇంకో గమ్మత్తు జరిగింది" అన్నారు చంద్రశేఖరం. అందరూ నిశ్శబ్దంగా వున్నారు.

"మొన్న నీమధ్య రాజమండ్రి నుండి వాల్తేరు పోతూ సామర్లకోటలో పిల్లలకి మంచినీళ్లకని మగర చెంబుపట్టకొని కుళాయి వైపు వెళుంటే 'శేఖరం పెదనాన్నా' అని పలకరించేడు. అటు తిరిగి చూద్దును కదా చిన్న గున్నేనుగు నడుస్తున్నట్టే నడుస్తున్నాడు. మొదట్లో పోల్చుకోలేకపోయేను. కాకినాడలో మందులషాపు పెట్టేడట. కౌంటర్ దగ్గర కూర్చోడంతప్ప పనేమీ లేకపోడాన్ని శరీరం పెంచేడట.

'తర్వాత 'రండి పెదనాన్నా! మా పిల్లల్ని చూద్దురుగాని' అని తను కూర్చున్న పెట్టెదగ్గరికి తీసుకువెళ్ళేడు. కిటికీలో నుండి ఎవరో ఒకావిడ చూస్తోంది. మొహం పాలిపోయి, దవడలు లోతుకుపోయి, కళ్ళూ పళ్ళూ బయటికివచ్చి సన్నంగా వుంది. ఆవిడ గడ్డం పట్టుకు పక్కకి తిప్పుతూ మారాం చేస్తున్న పిల్లణ్ణి చీపురుపుల్లలాంటి చేతితో మందలిస్తోంది. మేం పెట్టెదగ్గరికి చేరగానే మొహం ఒక్కసారి లోపలికి తిప్పుకుంది.

'మీ కోడలు పెదనాన్నా' అన్నాడు విశ్వం. నా ఆశ్చర్యానికి అంతులేదు. విశ్వాన్ని చూడగానే పెళ్ళినాటి గొడవ గుర్తువచ్చి వాడి పెళ్ళాం మరోకలాగ వుంటుందని వూహించుకున్నాను.

విశ్వం వాళ్ల పిల్లల్ని నలుగుర్ని చూపించేడు. వాళ్ళుకాక సంవత్సరం పూర్తికావస్తున్న పాప వుందని పెట్టెలో నుండి ఒక చంటిపిల్లను తీసుకువచ్చి చూపించేడు.

వస్తున్న నవ్వు అపుకుంటూ 'పెళ్ళయి చాలాకాలం అవుతుందికదూ' అన్నాను.

'పదేళ్ళు అవుతుంది పెదనాన్నా' అన్నాడు. ఇంజను నీరు నింపుకుని వచ్చింది సిగ్నలు వాలింది. నేను నా పెట్టెవైపు మంచినీళ్ళు పట్టుకుని వెళ్లిపోయేను.

మరికొంత సేపటికి రైలు కదిలింది. విశ్వం పెళ్ళి గురించి ఆలోచిస్తూ "ఒకనాడు తన చక్రాలకింద నలిపివేయవలసిన రైలు యీ వేళ వాణ్ని భారంగా మోసుకు వెళ్తోంది' అనుకున్నాను." అని చంద్రశేఖరం తన కథ ముగించారు. ★

## వనితావాణి

(41-వ పేజీ తరువాయి)

వున్నారు. ప్రత్యేకం నోముల పుస్తకాలు కూడా వుంటాయి. 'వనితాలోకంలో' కూడా అవి అనవసరమేమో!

అయినా సోవియట్ వుపగ్రహాలు రోదసిలో విజయవిహారం చేస్తున్న యీ కాలంలో వనితలు చెప్పుకోవలసినవి యివేనా అని మాకు ఆశ్చర్యం కల్గుతోంది. మహిళాభ్యుదయమంటూ కృషిచేస్తూ, ముందుకుపోతున్న స్త్రీలు యిలాంటి ముసలమ్మల కబుర్లు విడనాడితే తప్ప లాభం వుండదు.

'వనితాలోకం'లో వ్యాసాలూ అవీ బావుంటున్నాయి. ఇంకా చక్కని వ్యాసాలతో 'వనితాలోకం' అభివృద్ధి పొందాలని ఆశిస్తున్నాను.

కుమారి లక్ష్మి (కె. వి. పి)


